# ఇదీ మన వ్యవస్థ ఇదే మన అవస్థ

—యామినీ సరస్వతి.

పిడుగులు పడినా చలించని గుండె నిబ్బరం కొందరిదైతే ఆకుపాటుకే అదిరిపడే సున్నిత స్వభావం కొందరిది. ఈ సున్నిత స్వభావాన్నే సందర్భాన్నిబట్టి దౌర్బల్యమని, పిరికితనమని, చాతకానితనమని అన్నా తప్పులేదు.

స్వోత్కర్ష నాకెప్పుడూ అలవాటు లేదు. నిజంగా నిజం చెప్తున్నాకదా, నేను వట్టి పిరికివాణ్ణి, చాతకానివాణ్ణి, భయస్థుణ్ణి, అర్భకుణ్ణి, పుస్తకంలో పాము బొమ్మ కనిపిస్తే, అప్పటికప్పుడు కాళ్ళు మడిచి కుర్చీలో పెట్టుకునే హృదయ దౌర్బల్యం నాది. చిన్నప్పటినుంచి ఈ భయం, బెరుకు నన్ను వదల్లేదు. మళ్ళీ ఇందులోనూ ప్రకృతి నాకు అన్యాయం చేసింది. ఆప్తులు, మిత్రులు నన్ను 'మాన్లీ'గా వున్నానని పొగుడుతారుగాని, గిట్టనివాళ్ళు నేను విలన్‌లా కన్పిస్తానని అభివర్ణిస్తారు. కనిపించడమేగాదు, నేను నిజంగాకూడా విలన్నేనని నమ్మేవాళ్ళు వుంటే అది వేరే విషయం. లోకానికి ఇంత భీకరంగా కనిపించే నా ఆకారం లోపల ఒక పసితనపు బేలమనసే వుందని ఎవరికీ తెలియదు. నిజానికి చాలాసార్లు నేనుకూడా మరిచిపోతుంటాను. అయితే అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు నిజస్వభావం బైటపడి నన్ను అసహాయుణ్ణిగా నిలబెడుతూ ఉంటుంది.

ఈ బేలతనాన్ని పోగొట్టుకోవడానికి డిటెక్ట్ నవలలు చదివాను. దయ్యాలు, హత్యలు, థ్రిల్, హారర్ సినిమాలు చూశాను. లాభం లేకపోయింది. నేను నేనుగానే మిగిలాను.

నాలోని పసివాణ్ణి ఎవరూ గుర్తించరని అన్నానుకదా, ఆ మాట పూర్తిగా రైటు కాదేమో; మా బాలగోపాలం నన్ను అంతో ఇంతో అర్థం చేసుకున్నాడనే చెప్పాలి.

ఇద్దరం ఒకే వూరివాళ్ళం. చాలా కాలంపాటు కలిసే చదువుకున్నాం. నేను బి.కాం. తర్వాత చిన్న ఉద్యోగం చూసుకుని సెటిలైపోయాను. బాలగోపాలానికి చిన్నప్పటినుంచి నాటకాలపిచ్చి. ఆ పిచ్చి వాణ్ణి సులభంగా వదిలేసేదేమోగాని, వాడు మాత్రం ఆ పిచ్చిని వదల్లేదు. నటుడుగా పోటీని బట్టుకోలేననిపించాక, వాడు హఠాత్తుగా నాటక రచయితైపోయాడు. నాటికలు, నాటకాలు శరవేగంతో రాసేసి ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిపారేశాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకి మద్రాసుకి మకాం మార్చేశాడు. గడసరితనం, పట్టుదల ఉన్న మనిషి సాధించలేనిదేమిటి? మద్రాసు చేరిన నాలుగైదేళ్ళకే మా బాలగోపాలం బిజీ రైటరైపోయాడు. సినిమాలకి వాడు రాసిన మాటలు వింటూ నేను కొన్ని సందర్భాల్లో పడి పడీ నవ్వాను. దుఃఖం ఆపుకోలేక ఏడ్చేశాను. వాడు 'మా బాలగోపాలం' అనుకోవడం చాలా గొప్పగా అనిపించిందప్పుడు.



ఆఫీసు పనిమీద మద్రాసు వెళ్ళాల్సి

చ్చింది. నాకు మద్రాసు కొత్త. లాడ్జి ఖర్చులు ఆఫీసే భరిస్తుందిగాని, ఏ లాడ్జిలో దిగాలో వెంటనే తోచి చావలేదు. వెళ్ళే లోగా ఎలాగూ బాలగోపాలాన్ని కలవాలనుకున్నానుగదా, ఆ పని ముందే చెయ్యొచ్చు, కనీసం ఫోన్‌లో అయినా అతణ్ణి సంప్రదించి, వాళ్ళింటికి దగ్గరగా దిగవచ్చుననుకున్నాను. ఫోన్ చేశానుగాని, బాలగోపాలం ఇంట్లో లేడన్నారు. నేనెవరూ, ఏమిటని ఆరా తీశారు. ఆ తర్వాత బాలగోపాలం ఫలానా లాడ్జిలో వున్నాడని ఆ లాడ్జి నంబరు చెప్పారు. ఆ లాడ్జికి ఫోన్ చేశాను. దొరికాడు బాలుడు. ఫోన్‌లో వాడిగొంతు వినగానే ప్రాణం లేచివచ్చినట్టయింది. ఎక్కణ్ణుంచి మాట్లాడుతున్నావన్నాడు. బస్‌స్టాండునుంచి అన్నాను. మంచి లాడ్జిని సూచిస్తే, వెళ్ళి దిగుతానన్నాను. ఏడిశావు. నేనున్నాననుకున్నావా?

చచ్చాననుకున్నావా? అన్నాడు. ఉన్నావనే అన్నాను. అయితే తిన్నగా సూటుకేసుతోసహా ఇక్కడికి వచ్చెయ్యి. రూం నంబర్ ఫోర్నాట్టూ, అన్నాడు. నేనేదో చెప్పబోయేంతలో వాడవతల ఫోను పెట్టేశాడు.

ఆటోలో వెళ్ళి దిగాకగాని తోచలేదు నాకు, అది నక్షత్రాల హోటలని. ఒకటి రెండూ కాదు, ఐదు నక్షత్రాల హోటలది. ఇదివరకెప్పుడో ఒకసారి, ఏదో కంపెనీ వాళ్ళిచ్చిన పార్టీకోసమని ఒక నక్షత్రాల హోటల్‌లో కాన్ఫరెన్స్ హాలులోకిమాత్రం వెళ్ళాను. లోపల గదులెలా ఉంటాయో తెలీదు నాకు. ఇంత విలాసవంతమైన హోటల్‌లో మావాడు బస చేస్తున్నాడంటే నాకెంత గర్వకారణం!

ఫోర్నాట్టూలోకి వెళ్ళేసరికి మావాడు నన్ను సాదరంగా ఆహ్వానించాడు. అప్పుడు వాడొక్కడే లేడు. పక్కన మరో వ్యక్తి వున్నాడు. వాడు పనిజేస్తున్న సినిమాకంపెనీ వాళ్ళకు అసిస్టెంటుట. మా వాడు కథా మాటలూ రాయడంలో చేయి తిరిగి పోయాడు. అందినంత మేరకు రెండుచేతులా సంపాయిస్తున్నాడు. మాటలు చెప్పడం, మాటలు రాయడం ఒకేపని. మాటలతో వ్యాపారం చేయడంలో అంత మజా వుందని నాకు అంత వరకూ తెలియదు. తెలివుండాలేగాని, దేన్నయినా డబ్బుచేసుకోవచ్చు. మాట లంటేమాత్రం ఏం మాటలా! అంటాడు మావాడు.

అసిస్టెంటుని పంపేసి మావాడు ఆత్మీయపర్వంలోకి దిగాడు. నాకు అతిథి మర్యాదలు చేశాడు. మద్రాసులో ఎన్ని రోజులుంటే అన్నిరోజులూ, తనతో ఆ గదిలోనే వుండమన్నాడు. ఖర్చంతా ప్రొడ్యూసర్‌ది తనదేం పోదన్నాడు. మరి ప్రొడ్యూసరు మొహం మాడ్చుకుంటేనో? అన్నాను. మన మాటలూ మాడిపోతాయి గదా! అన్నాడు వాడు. తనకూ కంపెనీ లేకుండా బోరు కొడుతోందనీ, నేనుంటే హాయిగా వుంటుందనీ అన్నాడు. మరి నీ రాతపని ఎలాగ? అన్నాను. రాసినంతా రాస్తాను. లేకుంటే డార్లో కార్లో చెప్తాను, అసిస్టెంటు రాసుకుంటాడు. లేకుంటే సెట్లో అప్పటికప్పుడు చెప్తాను... అన్నాడు. వాడి ధీమాకి ఆశ్చర్యమనిపించింది. అలా వుండబట్టే నెగ్గుకొస్తున్నాడు. నాలాంటివాడైతేనా, సరేసరి.

బాలగోపాలం నాతో కబుర్లు చెబుతూ




చిన్ననాటి సంగతులు నెమరేసుకుంటూ వుండగానే, ఎక్కణ్ణుంచో ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడాక అతను రెండు నిమిషాల్లో రెడీ అయిపోయాడు. ప్రొడ్యూసర్ రెడ్డిగారినుంచి ఫోను... అంటే సిల్వర్ జూబ్లీ పిక్చరేనన్నమాట. ఇటువంటి ఆఫర్ మళ్ళీ మళ్ళీ రాదు. ... అని అతను కులు పొతుకులుగా ఇంకా ఏదో అని, - నే వెళ్తున్నాగాని, నువ్వు హాయిగా రిలాక్స్ తీసుకో. ఏం కావాలన్నా తెప్పించుకో. దేనికీ నువ్వు డబ్బివ్వనవసరం లేదు. నీ యిష్టం వచ్చినప్పుడు రావచ్చు, పోవచ్చు నేను ఏ రాత్రికో వస్తాను. అందాకా బై అంటూ వెళ్ళిపోయాడు బాలుడు.

ఇంత యమబిజీ అయితే ఎలాగ? అయినా ఇదీ ఒక థ్రిల్లేననుకున్నాను.

సూటుకేసు విప్పి లుంగీ తీసి కట్టుకుని, మావాడు చెప్పినట్టు హాయిగా రిలాక్సయిపోయాను.

ఎంతసేపు నిద్రపోయానోగాని, ఫోన్ మోతకి మెలకువొచ్చింది. మా బాలుడే! సినిమా కంపెనీనుంచే ఫోన్ చేశాడు. నన్ను కాస్త పరామర్శ చేశాడు. నా ప్రోగ్రాం ఏమిటని అడిగాడు. ఆఫీసు పనిమీద నేను సిటీలో కొందరు మనుషుల్ని కలుసుకో వలిసింది - మర్నాడు. అంత వరకు ఫ్రీయే. అదే చెప్పాను. సాయంత్రం ఏదైనా మంచి ఇంగ్లీషు సినిమాకి వెళ్దామా? అని నేనే ప్రపోజ్ చేశాను. సెకండ్‌షోకైతే వీలవుతుందన్నాడు మా వాడు. అంతవరకు నువ్వు రూంలోనే పడి వుంటావా యేం? అన్నాడు. ఖాళీ దొరికితే చాలు వీధులంట రికామీగా తిరగడం నాకు అలవాటని మావాడికి బాగా తెలుసు. సాయంత్రమౌతోందిగా, అలా బైటికి వెళ్ళి కాస్త గాలి పీల్చుకొస్తాను, అన్నాను. తొమ్మిదీ తొమ్మిదిన్నరకల్లా లాడ్జికి వచ్చేస్తానని వాడు ఫోన్ పెట్టేశాడు.

నేనో పావుగంటలో తయారయి, కాఫీ తెప్పించుకుని తాగి, రూం తాళం కౌంటర్లో ఇచ్చి బైటపడ్డాను.

కాలు సాగినంతమేరా నడిచి నడిచి, అక్కడో పార్లర్‌లో సామోసాలు, ఐస్‌క్రీం ఆరగించి, మరికాస్త దూరం నడిచి వెళ్ళాను. అది మౌంట్ రోడ్డని తెలిసింది. విండోషాపింగ్ చేసుకుంటే మరో అరగంట గడిచేసరికి అలసటనిపించింది. మళ్ళీ హోటల్ దాకా నడిచే

ఓపిక లేక ఆటో ఎక్కేశాను.

రూంలోకెళ్ళి బెడ్‌మీద వాలి కాసేపు రెస్టు తీసుకున్నాను. మరునాటిరోజు నేను కలుసుకోవాల్సిన మనుషుల. సూట్‌కేసులో ఫైల్‌లో ఉండిపోయాయి. ఒకసారి ఆ అడ్రస్‌లు చూసి, వాటిగురించి మావాణ్ణి వాకబు చేయడం మంచిదికదా? అనుకున్నాను.

సూట్‌కేసు తీసి మంచంమీద పడేసి తెరిచి చూశాను. అదిరి పడ్డాను. కళ్ళు తిరిగాయి.

సూట్‌కేసునిండా నోట్లు, పచ్చనోట్లు. నోట్లకట్టలు సూట్‌కేసునిండా నోట్లే. ఎన్ని ఎంత? ఎంతైతేనేం...

గుండె ఆగి, కొట్టుకుంటోంది.

సూట్‌కేసులోకి ఈనోట్లెలావచ్చాయి, నా సూట్‌కేసదే.... అనుకుంటూ సూట్‌కేసుని ఆత్రుతగా చూసేసరికి అది నా సూట్‌కేసుకాదు. నా సూట్‌కేసులానే ఇదీ వి.పి.ఐ. దే ఒకేరంగు, కేసైజు, అయితే ఇది నాదికాదు, ఈ సూట్‌కేసు గదిలోకెలా వచ్చింది, అనుకుంటూనే తలలో మెరుపు మెరిసింది. గదంతా ఒక్కసారి కలయ చూసే సరికి ... అది నాగదికాదు, అదీ-మావాడి గదికాదు, మూలన స్టాండ్ మీద చీరలు ఉన్నాయి. ఆ ప్రక్కన కోటు కూడా తగిలించి ఉంది. గుడ్‌గాడ్.

కరెన్సీ నోట్లున్న సూట్‌కేసు మా గదిలోకి రాలేదు.

కరెన్సీనోట్లున్న సూట్‌కేసున్న గదిలోకి నేనే వచ్చాను-ఇదెలా జరిగింది?

మావాడి రూం నెంబర్ 402,

ఈ రూంలో ఫోన్‌మీదే ఉంది రూం నెంబర్ - 420. కౌంటర్లో నేను పొరపాటున ఫోర్‌ట్వెంటీ అని చెప్పానా? నేను ఫోర్‌నాట్టూ అన్నా గానీ కౌంటర్‌లో మనిషే పొరపాటున ఫోర్‌ట్వెంటీ తాళం ఇచ్చాడా?

కౌంటర్‌లో మనిషి ఇటువంటి విషయాల్లో పొరబడే అవకాశం తక్కువ, నేను వస్తున్నప్పుడు కౌంటర్ దగ్గర జనం కూడా ఆట్టే లేరు, నేను 420 అనే చెప్పి ఉంటాను, నేనడిగిన తాళమే అతనిచ్చి ఉంటాడు-


వెంటనే వెళ్ళి తాళం రిటర్న్ చేసెయ్యాలనుకున్నాను. ఇది మామూలుగది కూడా కాదు. సూట్‌కేసు నిండా డబ్బున్న గది, ఎన్ని లక్షలో గాని ....

ఆ సూట్‌కేసుని మళ్ళీ షెల్ఫ్‌లో సర్దెయ్యాలి. పొరబాటున అయినా ఈ గదిలోకి మరెవరో వచ్చినట్టు ఏమాత్రం అనుమానం రాకూడదు. అటువంటి అనుమానం వస్తే, నేను పట్టుబడాల్సి వస్తుంది. కాని, ఆసూట్‌కేసుని మళ్ళీ తాకాలన్నా, దడుపు పుట్టుకొచ్చింది. అయితే దాన్ని అలాగే వదిలి వెళ్ళడం ఎలా?

గది మధ్యలో ఇది మాటలా నిలబడ్డాను. ఒళ్ళంతా చెమటలు పోశాయి. నేను జీవితంలో ఎన్నడూగాని కళ్ళజూడలేనంతటి డబ్బు, అందుబాటులో ఉంది. ఆ సూట్‌కేసు పట్టుకుని నేను తిన్నగా హోటల్‌నుంచి నడిచి వెళ్ళిపోవచ్చు. ఆ తర్వాత ఏమౌతుందోగాని...ఈ డబ్బుతో పెద్ద వ్యాపారం పెట్టుకుని దర్జాగా బ్రతకవచ్చు.

దొంగిలించేమాట దేవుడెరుగు, సూట్‌కేసును సర్దేసి రూమునుంచి బయటపడితే






చాలు... గదిలో నేనుండగా ఎవరైనా వస్తే...

చప్పున సూట్‌కేసుని అందుకుని షెల్ఫ్‌లో సర్దబోయాను. అంతలో తలుపు చప్పుడైంది. కీ హోల్ తాళంచెవి కదిలింది. సూట్‌లో ఉన్న ఒక వ్యక్తి గుమ్మంలో నిలబడ్డాడు. నన్ను చూసి మొదట నిర్ఘాంత పోయాడు. ఆ వెంటనే "థీఫ్" అని కేకేశాడు. కేక వేసిన వెంటనే అవతలికెళ్ళిపోయి తలుపు దఢాల్న మూసేశాడు. కీహోల్‌లో తాళం తిరిగింది. నేను ట్రాప్ అయిపోయాను. వరండాలో అడుగుల చప్పుడు, కేకలు, ఎవరో ఫోన్‌లో మాట్లాడుతున్నశబ్దం...

గది మధ్యలో కుప్పకూలిపోయాను. ఎంత టైము గడిచిందో తెలియదు. మళ్ళీ తలుపు తెరుచుకుంది. ముందుగా ఉన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టర్. ఆయన చేతిలో రివాల్వర్. ఆ వెనుకే సూట్ మనిషి, హోటల్ మేనేజర్...

నేను పోలీసుల మధ్య ఉండగానే, సూట్‌మనిషి సూట్‌కేసు తెరిచి డబ్బు లెక్క చూసుకున్నాడు. అంతవరకు నేను ధీమాగానే ఉన్నానుగాని, లక్షరూపాయలు తగ్గినయి, అన్నాడు సూటువాడు. నా గుండె గుభేల్మంది.

లేదు. నేను డబ్బు తియ్యలేదు, కావలిస్తే తనిఖీ చేసుకోండి అని అరిచాను. వాళ్ళు నా జేబులలో వెతికారు. ఫోర్నాట్టూలోకూడా వెతికారు. ఏమీ దొరకలేదు. అయినా వాళ్ళ అనుమానం వదల్లేదు.

ఫోర్‌ట్వంటీలోకి నేను ఇదివరకే ఒకసారి వచ్చి ఉండవచ్చునన్నారు. అప్పుడు కొంత డబ్బుని మాత్రం చోరీచేసి సిటీలో ఎక్కడైనా దాచి ఉండవచ్చునన్నారు. సిటీలో మరెక్కడైనా నేనుదాచడమేమిటి? నాకెవరు తెలుసు? అని అరిచి మొత్తుకున్నా నా గోల ఎవరూ వినిపించుకోలేదు.

ఆ రాత్రి పోలీస్ స్టేషన్‌లో గడపవలసి వచ్చింది.

జీవితంలో తొలిసారిగా పోలీసు లాకప్‌లో ఆ నరకం వర్ణనాతీతం.

తెల్లవారుఝామున వచ్చాడు బాలగోపాలం. బెయిల్‌కోసం ప్రయత్నించాడుగాని, ఇవ్వనన్నారు.

—నువ్వు ఆ సరికే డబ్బుతీసి ఎక్కడైనా దాచావంటే నేను నమ్మలేననుకో. అయినా ఈజీగా బిగ్‌మనీ సంపాయించవచ్చనే ఆలోచన ఎలా వచ్చిందిరా నీకు? అన్నాడు మా బాలుడు.

ప్రపంచం తల్లక్రిందులైంది. ఎవరికి చెప్పుకోవాలిక ?

నాలుగు రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాను. ఆశగా పోలీసులు మా వూరెళ్ళారు. ఇల్లు సోదా చేశారు. ఆఫీసుకి వెళ్ళారు. దర్యాప్తు చేశారు. మావిడా పిల్లలూ గోడు గోడు మన్నారు. మద్రాసులో నాకు తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారా ? అని ఆరాలు తీశారు. నేను డబ్బు దాచే అవకాశాలున్నాయా ! అని పోలీసులు తర్జన భర్జనలు పడ్డారు.

కేసు విచారణకి వచ్చింది. మాలాయరు దాకచక్యమంతా ఉపయోగించాడుగాని అతనేం దేవుడు కాదుగదా ? చోరీసొమ్ము పట్టుబడలేదుగాని, నేను వేరేవాళ్ళ గదిలోకి ప్రవేశించాను. డబ్బుతో ఉన్న సూట్‌కేస్‌ని తెరిచాను. చోరీచేసే వుద్దేశ్యం నాకు ఉన్నట్టు ప్రాసిక్యూషన్ బల్లగుద్ది అదరగొట్టి వాదించాడు. అక్రమ ప్రవేశం చోరీ యత్నం ఆరోపణలమీద ఆరునెలల శిక్ష పడింది.

మావిడా పిల్లలూ హృదయ విదారకంగా విలపిస్తూ ఉండగా, వ్యాన్ ఎక్కి వెళ్ళాను. జైలుకి.

మళ్ళీ తలుపు చప్పుడు, తలుపు మూసిన శబ్దం.

ఈ రూం కాదు. ప్రక్కరూం, అయితే అంతకుముందు నేను విన్నదికూడా పక్కగది తలుపు చప్పుడేనన్నమాట.

ఫాంటసీ కరిగిపోయింది.

సముద్రకెరటంలా నా భయంకరమైన ఊహ వెనక్కి వెళ్ళిపోయింది.

సూట్‌కేసుని షెల్ఫ్‌లో సర్దేశాను. [illegible] సతమాయించుకున్నాను.



గనిపుష్పం ఒంటరిగా నిలబడ్డానుగాని, నాలోని ఇడియట్‌ని బలవంతంగా మూలకి నెట్టి, ఆలోచనలని [illegible] పరిగెత్తించాను.

షెర్లక్‌హోమ్స్, అగాథాక్రిస్టీ, హాడ్లీ ఛేజ్, పెర్రీమాసన్, వాడేహౌస్, కొమ్మూరి సాంబశివరావు... నేను చదివిన డిటెక్టివ్ నవలల పరిజ్ఞానాన్ని ఒక్కసారి ఆవాహన చేశాను. కూల్... కూల్... కూల్ కూల్‌డౌన్.

తలుపు తెరిస్తే కనిపించిన వదినా, లోపలికొచ్చాడను, వెళ్ళొచ్చాడను, సహజంగా, అతిసహజంగా ప్రవర్తించాలి. అంతే. సహజంగా [illegible] ఎలా బైటపడాలి ?

తలుపు తీయనమే. తీశాను. వరండాలో ఎవరూ లేరు. ఉన్నా, నేను పట్టించుకోదలచను. తాళం వేశాను. కీరింగ్‌కి వేలాడుతున్న ప్లేటుమీద 420 అంకె వెక్కిరిస్తోంది. తాళంచెవి అలాగే జేబులో వేసుకున్నాను. మళ్ళీ అప్పుడే 402 దాకా వెళ్ళవలసిన అవసరం లేదు.

కౌంటర్ దగ్గిరికొచ్చాను. అక్కడ ముగ్గురైదుగురు [illegible] ఉన్నారు.

మరో జేబులోంచి పర్సు తీశాను. అందులోంచి ఏదో కాగితం తీసి, దాన్ని చూసుకుంటూ కౌంటర్ దగ్గిరికి వచ్చి చాలా యథాలాపంగా తాళం తీసి కౌంటర్‌మీద పెట్టాను. కౌంటర్‌లో మనిషి నన్ను చూశాడా ? గుర్తుపట్టేంతగా చూశాడా ? నాకు అనుమానం. కాగితాన్ని మడత పెడుతూ కాయితం మడతని పర్సులో పెట్టేస్తూ నడుస్తూ సోఫాలుదాటి నడుస్తూ గుమ్మందాటి గుమ్మావైపు చూడకుండా దూరానికి చూపుసారిస్తూ నడిచి హోటల్‌నుంచి వచ్చేశాను.

ప్రాణవాయువు అంటే ఏమిటో తొలిసారిగా తెలిసినట్లయింది. మళ్ళీ వెళ్ళి 402 తాళం అడిగితేమాత్రం ఫాంటసీ కాస్తా నిజమయ్యే ప్రమాదం ఉంది. ఎనిమిదెన్నర దాకా రోడ్లు తిరుగుతూ ఉండి మళ్ళీ హోటల్‌కి వచ్చాను. సహజంగా వుండాలికాబట్టి తిన్నగా కౌంటర్ దగ్గరికెళ్ళి, 402లో మావాడున్నాడా ? అని అడిగాను. ఇంకా రాలేదు. మీరు రూంలోకి వెళ్ళొచ్చుగా అన్నాడు కౌంటర్ మనిషి. థేంగాడ్ ఇందాకా 420 తాళం నేను తీసుకుని వాపసిచ్చినట్టు అతను గుర్తించలేదన్నమాటే ! లేక, నేను ఇందాకా 402 తాళం తీసుకుని మళ్ళీ తిరిగి ఇచ్చేశాననుకుంటున్నాడా ? నాకు అనవసరం.




మా బాలుడు వచ్చింతర్వాత అతన్తోబాటు నిస్సంకోచంగా 402కి వెళ్ళాను. రూం గుమ్మంపై నంబర్నూ, తాళం చెవి నంబరూ మార్చిమార్చి చూస్తుంటే ఎమరీ అంత జాగ్రత్త దేనికి? అన్నాడు బాలుడు.

సినిమాకెళ్తూ దారంట, జరిగిందంతా చెప్పేసరికి పకపకా నవ్వాడు. నువ్వో ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ ముఠా పెడితే బాగుంటుందిరా, అని వ్యాఖ్యానించాడు.




స్మగ్లింగ్ మాట దేవుడెరుగు, నేనిప్పటికీ బస్సెక్కినా, రైలెక్కినా ప్రయాణం ముగిసే వరకు సీటు నంబర్ చూసుకుంటూనే ఉంటాను. ప్రపంచంలో ఎప్పటికైనా ఈ నంబర్ల పద్ధతి పోవాలని నేనో సిద్ధాంతం రూపొందించాను. సరే, దాన్నెవరు పట్టించుకుంటారు ?